క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

- కలెక్టర్ బాదావత్ సంతోష్
- బెల్లంపల్లి సీవోఈలో అట్టహాసంగా జోనల్‌స్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

గౌరవ వందనం చేస్తున్న విద్యార్థులు

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్ బదావత్ సంతోష్

బెల్లంపల్లిరూరల్, అక్టోబర్ 13: చక్కని చదువుతో పాటు క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉజ్వలమైన భవిష్యత్ ఉంటుందని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ) లో నాలుగు రోజుల పాటు జరుగనున్న సంక్షేమ గురుకులాల 9 వ జోన్ క్రీడా పోటీలను ఆయన అట్టహాసంగా ప్రారంభించారు. ముందుగా కలెక్టర్ బాదావత్ సంతోష్‌కు నాలుగు జిల్లాల విద్యార్థులు స్వాగతం పలికారు. విద్యార్థులను కలెక్టర్ పరిచయం చేసుకున్నారు. మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పించిన అనంతరం అదనపు కలెక్టర్ రాహుల్, గురుకులాల ఓఎస్డీ రమణారావు, మున్సిపల్ కమీషనర్ సమ్మయ్య, ప్రిన్సిపాల్ ఐనాల సైదులు తో కలిసి జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం క్రీడా పతాకాలను అదనపు కలెక్టర్ రాహుల్, గురుకులాల ఓఎస్డీ రమణారావుతో కలెక్టర్ ఆవిష్కరించారు. క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. విద్యార్థుల గౌరవవందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడామైదానం ప్రతీ ఒక్కరిలో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించే ధృక్పథాన్ని అలవర్చుతుందన్నారు. సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను వెలికి తీయడానికి పలు స్థాయిల్లో క్రీడలను నిర్వహించడం అభినందనీయమన్నారు. సంక్షేమ గురుకులాల్లో విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యతనివ్వడంతో నందిని ఏషియన్ గేమ్స్‌లో పతకం సాధించిందని గుర్తు చేశారు. అదనపు కలెక్టర్ రాహుల్ మాట్లాడుతూ క్రీడలు జీవితంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించి గెలిచే శక్తినిస్తాయన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొనడం చూస్తే తన చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకువస్తున్నాయన్నారు. బెల్లంపల్లి సీవోఈను విజయవంతంగా నిర్వహిస్తున్న అధ్యాపకులకు అభినందనలు తెలిపారు.

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

అలరించిన ప్రదర్శనలు

క్రీడా మైదానంలో జాతీయ సమైక్యత ప్రతిబింబించేలా విద్యార్థులు చేసిన మార్చ్‌ఫాస్ట్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. రెబ్బెన గురుకులం, బెల్లంపల్లి సీఈవోకు చెందిన విద్యార్థులు,విద్యార్థినుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్, ఓఎస్డీ రమణారావు లతో పాటు పలువురు అధికారులను శాలువాలతో ప్రిన్సిపాల్ ఐనాల సైదులు సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బీ సుధాకర్, మున్సిపల్ కమిషనర్ కే సమ్మయ్య, ఎంఈవో పీ మహేశ్వర్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, జోనల్ గేమ్స్ ఓవరాల్ ఇన్‌చార్జి దాసరి ప్రసాద్, ఆదిలాబాద్ డీసీవో ఎస్.శ్రీనివాస్, ప్రిన్సిపాళ్లు లలితకుమారి, జ్యోతి, సంధ్యారాణి, ఊటూరి సంతోష్‌కుమార్, స్వరూప, ఫిజికల్ డైరెక్టర్లు రవి, శ్రీధర్, అల్లూరి వామన్, నాలుగు జిల్లాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులు ఆధార్ ప్రామాణీకరణ పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 13 : రైతులు కచ్చితంగా ఆధార్ ప్రామాణీకరణ(బయోమెట్రిక్) పూర్తి చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, మార్కెటింగ్, సీసీఐ అధికారులు, రవాణా శాఖ, అగ్నిమాపక శాఖ, తూనికలు కొలతల శాఖ, జిన్నింగ్ మిల్లుల యజమానులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పత్తి కొనుగోలుకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని, కనీస మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుంచి పత్తి కొనుగోలు చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చూడాలని కోరారు. జిల్లాలో 1,50, 525 ఎకరాల్లో పత్తి సాగు చేయగా 14.30 లక్షల క్వింటాళ్లు దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. రైతులు ఆధార్ బయోమెట్రిక్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని, ఆధార్‌తో అనుసంధానం చేసిన బ్యాంకు ఖాతా సంఖ్యకు మాత్రమే డబ్బులు జమ చేస్తామని, అందుకోసం రైతులు తమ బ్యాంకు ఖాతాలకు ఆధార్‌తో పాటు మొబైల్ అనుసంధానంపై ముందస్తుగా నిర్ధారణ చేసుకోవాలన్నారు. దీనిపై మండల స్థాయిలో ఏవోలు, క్షేత్ర స్థాయిలో ఏఈఓలు అవగాహన కల్పించాలన్నారు.

మద్దతు ధర పొందాలి

అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ధాన్యం కొనుగోలుపై సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడారు. క్వింటాల్ వరి ధాన్యానికి సాధారణ రకానికి 2,183 రూపాయలు, గ్రేడ్ ఏకు 2,203 రూపాయలు ప్రభుత్వం చెల్లిస్తుందని, రైతుల ధాన్యం దళారుల పాలు కాకుండా చూడాలన్నారు. జిల్లాలోకి ఇతర జిల్లాల, రాష్ట్రాల ధాన్యం దిగుమతి కాకుండా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి నిఘా పెడుతున్నామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్, డీఏవో కల్పన, డీఆర్‌డీవో శేషాద్రి, సివిల్ సప్లయ్ డీఎం గోపాల్, డీసీవో కృష్ణ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన బతుకమ్మ సంబురాలు

బతుకమ్మ ఆడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు

బెల్లంపల్లి, అక్టోబర్ 13: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. ప్రిన్సిపాల్ మేకల గోపాల్, వైస్ ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, అకాడమిక్ కో ఆర్డినేటర్ శ్రీలత కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కాంపల్లి శంకర్, రేష్మా, మహిళా లెక్చరర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహించిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమాన్ని వాట్సాప్ ద్వారా తిలకించిన సినీ గేయ రచయిత, డైరెక్టర్ తైదల బాపు వెంటనే స్పందించి తన అనుచరులు ద్వారా కార్యక్రమ నిర్వాహకులకు స్మార్ట్ వాచ్‌ను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అంజయ్య, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ సోమయ్య, మహిళా లెక్చరర్లు, విద్యార్థి నులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

బెల్లంపల్లి, అక్టోబర్ 13: తాండూర్ మండలం గొర్లపల్లి గ్రామానికి చెందిన పకీర్ (85) రైలు ఢీకొని మృతి చెందినట్లు బెల్లంపల్లి రైల్వే హెడ్ కానిస్టేబుల్ లక్ష్మారెడ్డి తెలిపారు. శుక్రవారం తంగళ్లపల్లి ప్రభుత్వ దవాఖానకు వెళ్లడానికి రైల్వే ట్రాక్ దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేశ్‌కు నివాళి

మల్లేశ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బెల్లంపల్లి, అక్టోబర్ 13: మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేశ్ మూడవ వర్ధంతిని శుక్రవారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్, నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన పార్టీకి చేసిన సేవలను నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిప్ప నర్సయ్య, దాగం మల్లేశ్, ఆడెపు రాజమౌళి, చంద్ర మాణిక్యం, బొం తల లక్ష్మీనారాయణ, ఎల్తూరి శంకర్, బియ్యాల ఉపేందర్, శ్రీధర్, కొంకుల రాజేశ్, పులిపాక స్వామిదాస్, బొంకూరి రాంచందర్, ఎం రాజేశం, భరత్, గుండా ప్రశాంత్, మల్లయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తల్లిపాలతోనే పిల్లల ఆరోగ్యం

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక

సోమగూడెం అన్నప్రాసన చేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్, టీచర్

కాసిపేట, అక్టోబర్ 13 : తల్లిపాలతోనే పిల్లలకు ఆరోగ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక పేర్కొన్నారు. శుక్రవారం కాసిపేట మండలంలోని సోమగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ వకులాదేవి ఆధ్వర్యంలో అన్నప్రసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ రాధిక మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ వకులాదేవి, అంగన్‌వాడీ విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

పాతమామిడిపెల్లిలో పోలీసుల కళాజాత

దండేపల్లి, అక్టోబర్13: దండేపల్లి మండలంలోని పాతమామిడిపెల్లిలో పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం కళాజాత కార్యక్రమం నిర్వహించారు. లక్షెట్టిపేట సీఐ కృష్ణ మాట్లాడుతూ ఆత్మహత్యలు, గంజాయి, గుడుంబా, సైబర్ నేరాలు, ఎన్నికల నియమావళిపై వివరించారు. ముఖ్యంగా యువత గంజాయి బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ సహజం

సతీశ్‌ను సన్మానిస్తున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

హాజీపూర్, అక్టోబర్ 13: ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ సహజమని మంచిర్యాల జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో కన్నెపల్లి ఎంపీవోగా విధులు నిర్వహించి ఉద్యోగోన్నతి పొంది బదిలీపై మెదక్ జిల్లాకు డీఎల్పీవోగా వెళ్తున్న కొమ్మెన సతీశ్ సన్మాన సభలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. అనంతరం సతీశ్‌ను శాలువా పూల మాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, డీఎల్పీవో ఫణిందర్‌రావు, ప్రభాకర్‌రావు, ఎంపీడీవోల సంఘం అధ్యక్షుడు ఎంఏ.హై, ఎంపీవో అసోసియేషన్ కార్యదర్శి అజ్మత్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

కన్నెపల్లి, అక్టోబర్ 13 : మండలంలోని జజ్జరవెల్లిలో శుక్రవారం పేకాట ఆడుతున్న ముగ్గురిని పట్టుకున్నట్లు కన్నెపల్లి ఎస్ఐ నరేశ్ తెలిపారు. పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేసి పారుపెల్లి భూమయ్య, కొట్రంగి పోశయ్య, సుధాకర్‌ను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 8510 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు